# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.
web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**
మిస్. పి. ఇందిరాదేవి
డా॥ యమ్. స్వర్ణముఖి
సి.వి. రమణ బాబు
పి.యస్.ఆర్.కె. ప్రసాద్
కె. మురళీ మోహన వర్మ

సంపుటి 40 సంచిక 1
పేజీలు 44
సెప్టెంబర్ 2020

5సం॥ల చందా రూ. 250
2సం॥ల చందా రూ. 120
సంవత్సర చందా రూ. 60
విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD

**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**

దాశరథీ శతకము ........................................4
శ్రీబాబూజీ ఉవాచ........................................ 5
అమ్మమాట................................................ 8
గుర్వష్టకమ్ ..............................................11
గురువు ఆవశ్యకత .................. ..................13
మా ఆశ్రమం - శ్రీకాళీవనాశ్రమం.........15
రామాయణంలో స్త్రీ పాత్రలు......................17
బాబూజీతో అనుభవాలు ..............................19
ఆశ ...................... .................. ......................... ..................21
బ్రాహ్మణుడు.......... ................................ ..................25
అశ్రునివాళి ....................... ...............................26
ఎవరు అమరుడు? .... ........ ...... .................27
యోగం ......... ...... ...........................................29
శ్రీబాబు దివ్యవాణి ................ ..............................31
కైవల్యోపనిషత్ ... .................................................32
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు............................34
అత్రి మహర్షి ................ ................. ..................35
శ్రీ మళయాళ స్వామి ....... ...............................37
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....39
విష్ణు కథలు ....... ............................ ....................41

# దాశరథీ శతకము

- భద్రాచల రామదాసు

**రామ విశాల విక్రమ పరాజిత భార్గవరామ సద్గుణ**
**స్తోమ పరాంగనావిముఖ సువ్రత కామ వినీల నీరద**
**శ్యామ కకుస్థ వంశ కలశాంబుధిసోమ సురారిదోర్బలో**
**ద్ధామ విరామ భద్రగిరి దాశరథీ కరుణాపయోనిధీ!**

అమితమైన పరాక్రమము కలవాడవు, పరశురాముని జయించిన వాడవు, సద్గుణాలతో ప్రకాశించే వాడవు, పరస్త్రీలయందు ఆసక్తి లేని వాడవు, నల్లని మేఘము వంటి శరీర కాంతి కలిగిన వాడవు, కాకుస్థ వంశమును సముద్రమునకు చంద్రుని వంటివాడవు, రాక్షసులను సంహరించిన వాడవునైన భద్రాచల రామా!




*ఎవరిని సరస్వతీదేవి భాష్యకారుడని సంబోధించింది?
*నిత్యకళ్యాణం అంటే ఏమిటి?
*అశుచిలో కూడా భగవన్నామం ఎందుకు అభ్యాసం చేయాలి?
*మానవమాత్రుని పొగడటం ధర్మయుక్తం ఎలా అయింది?
*మంత్రానికి ప్రణవం చేర్చకపోతే ఏమవుతుంది?
*పరమాత్మని ప్రేమకు పాత్రుడు కావాలంటే ఏం చేయాలి?
*మనస్సుని అతీత స్థితికి తీసుకువెళ్ళే సాధనం ఏది?
*మైల ఎప్పుడు లేకుండా పోతుంది?
*కోతి చేతిని ఎవరు పట్టుకున్నారు?

***సమాధానాలు లోపలి పేజీలలో...........................***

# శ్రీబాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

6-5-1980

ఈ రోజు రాత్రి 9గంటలకు శ్రీ బాబూజీ మహరాజ్ "జ్ఞాని అంటే ఎవరు?" అని ప్రశ్నించారు.



"మామూలు మనిషిగానే జీవిస్తూ, నిత్యకర్మలను చేస్తూ, భౌతికంగా శారీరకంగా, మామూలు మనిషికి భిన్నంగా ఉండడు మహాత్ముడు. అయితే జ్ఞానికి సంసార తాపత్రయం, సుఖ దుఃఖాలు ఉండవు. సాధారణ మానవుల మనస్సు, అహంకార మమకారములనే పొరలచే కప్పబడి అజ్ఞానంతో కూడి వుంటుంది. అట్టి మనస్సు విషయాదుల పైకి మాత్రమే పోతుంది. కాబట్టి వాడు ఇంద్రియాలకు దాసుడై, కామక్రోధ, లోభ, మోహ, మదమాత్సర్యములకు, సత్త్వ రజ స్తమోగుణములకు ఆకర్షించబడి సంసార బంధములోపడి, జనన, మరణ విషవలయంలో చిక్కుకుంటాడు. వాడికి తత్త్వవిచారణ గూర్చి తెలియదు. తెలుసుకోవటానికి ప్రయత్నించడు. ప్రయత్నించినా, అజ్ఞానమనే అవిద్య అవరోధంగా ఉంటుంది. జ్ఞాని ధ్యానం ద్వారా అహంకార మమకారములను ఛేదించి, అజ్ఞానపొరను తొలగించుకొని, ఎప్పుడూ ఆనంద స్వరూపుడై ప్రకాశిస్తాడు. సత్త్వరజస్తమోగుణాలు అదృశ్యమై సత్యం, శివం, సుందరంగా మారతాయి. అంతఃకరణములు సత్యము, శాంతి, దయ, ప్రేమగా మారతాయి.

జ్ఞానికి కూడ బాల్యం, కౌమారం, యౌవనం, వృద్ధాప్యం అనే దశలుంటాయి. బాల్యకౌమార దశలలో జ్ఞానియొక్క నడవడి బాలకునివలె ఉంటుంది. చిలిపిగా, అందంగా ఉంటుంది. యౌవన దశ అంటే ఏదైన సాధించగల శక్తి, నవనవలాడే యౌవనవంతునివలె

వుంటుంది. వృద్ధాప్యమునందు జ్ఞాని జ్ఞానబోధ చేస్తూ ఉంటాడు. జ్ఞాని సకల విద్యాసంపన్నుడు, నిత్యుడు, సుఖదుఃఖాలకు అతీతుడు. కాలంతో పనిలేనివాడు, జనన మరణాలతో సంబంధంలేనివాడు. తాను ప్రకాశిస్తూ, అందరినీ ప్రకాశింపజేసేవాడు. భగవత్ గీతలో నాల్గవ అధ్యాయంలో జ్ఞానిని గూర్చి 20, 21 శ్లోకాల్లో వివరించబడి ఉంది. కర్మఫలాన్ని ఆశించకుండా నిత్యకర్మలు నిర్వహిస్తూ ఉండేవారికి వాంఛలు ఉండవు. వారు సుఖదుఃఖాలకు అతీతులు. వారికి దేహభావన, దేహదృష్టి ఉండదు.

ధనములేని వారి వద్దకు బంధువర్గం చేరతారా? నీరులేని చెరువులో జలచరాలుగాని, మరి యే ఇతర జంతువులుగాని వుంటాయా? యౌవనం పోయిన తర్వాత కామవాంఛ ఉంటుందా? అలాగే తత్త్వభావన కలిగినవారికి ఇంద్రియాలతో, అవి నిర్వహించే కర్మతో పని ఏముంది? అట్టివారే జ్ఞానులు. కాని కొంతమంది కపట జ్ఞానులు ఉంటారు. వారు విగ్గులు ధరిస్తారు. వారు తమను తాము మోసం చేసుకొని పతనం అవుతారు.

మరికొంతమంది, గురుసాన్నిధ్యంలో జేరి తామే సమస్త పండితులమని, మహా భక్తులమని, జ్ఞానులమని నటించి పతనమవుతారు. వ్యక్తులవలె కనిపించినా వారి తేజస్సు, కాంతి తెలుస్తూనే ఉంటుంది. గులాబి పరిమళాన్ని గురించి ఒకరు చెప్పవలసిన పని ఏముంది? కపట భక్తులకు గురువుయొక్క లక్ష్యార్థమునందు గురుదేవులయందు విశ్వాసము ఉండదు. వారు జనన మరణ విషవలయంలో పడి పతనమవుతారు. గురువు ఆజ్ఞమీరిన వారికి పతనం తప్పదు. అట్టి మూర్ఖులు కల్పాంతం వరకైనా జ్ఞానసిద్ధి పొందజాలరు. అట్టి మూర్ఖులను సైతము తరింపజేయమని పరమాత్ముని ప్రార్థిస్తాడు గురుదేవుడు. చూశారా! గురుదేవుల యొక్క ప్రేమానురాగాలు!

గురుదేవుణ్ణే దైవంగా భావించి గురువునే నిత్యంగా, సగుణంగా, నిర్గుణంగా ఆరాధించి, గురులక్ష్యార్థమునందు అచంచల విశ్వాసంతో ఉన్న భక్తులు, తప్పక జ్ఞానసిద్ధి పొందుతారు. ఇది మాత్రం సత్యం. బాబు వాక్కు ఎన్నడు వృథా కాజాలదు. గురువునందు అచంచల విశ్వాసము గలవారు వర్తమాన జన్మమునందే ఆత్మానందాన్ని పొందుతారు. అటువంటి జన్మ ఎత్తిన మానవుడు స్వల్పకాలము జీవించిన మాత్రము

ఏమి? జ్ఞానశూన్యుడై నూరుసంవత్సరములు బ్రతికినందువల్ల పొందేది ఏముంది?.

భక్తుడు సాధనద్వారా ఉన్నత శిఖరాలను చేరగలుగుతాడు. చాలామంది మనం నిత్యము ప్రార్థన చేస్తున్నాంకదా! పరమాత్మ నామాన్ని ఉచ్చరిస్తున్నాం కదా! ప్రతిరోజు మూడు పర్యాయాలు కళ్ళుమూసుకొని ధ్యానం చేసుకుంటున్నాంకదా! అని తామేదో సాధించవలసింది, సాధించగలిగామని అనుకుంటారు. వారు చేసే ధ్యానము నిత్యకర్మల్లో ఒకటిగా లేక ఒక విధిగా చేస్తారు. దానిద్వారా వారు పొందగలిగేది శూన్యం. నిశ్చల మనస్సుతో, ఏకాగ్ర మనస్సుతో జరిపిన ప్రార్థనే ఫలిస్తుంది. వేమనగారు చెప్పినట్లు చిత్తశుద్ధి లేని శివపూజ ఫలించదు. భగవానుని పాద పద్మములపై లగ్నం చేసిన ధ్యానం ఎంత కాలమైతేనేమి? ఒక్కక్షణమాత్రం మనస్సు నిలబడినా చాలు.

మానవసేవయే మాధవసేవ అన్నారు. కాబట్టి కేవలం మంత్రధ్యానమే కాకుండా, మంచి ప్రవర్తన కలిగి తోటి మానవులకు సేవచేయటంద్వారా, పరమాత్ముని ప్రేమకు పాత్రుడుకావాలి. కేవలం గ్రంథపఠన చేసినంత మాత్రంచేత పరమాత్ముని ప్రేమ సాధింపజాలడు. దాని సారాన్ని గ్రహించి ఆచరించిననాడు నిజమైన పండితుడు అవుతాడు. వేదాలు చాలా గొప్ప గ్రంథాలే. కాని వాటిని వల్లించినంత మాత్రంచేత వచ్చేది ఏమిటి? మానవుడు ఏ విధంగా పరమాత్ముని ప్రేమకు పాత్రుడవుతాడో, బ్రహ్మదేవుడు వేదాలలో వివరించి చెప్పాడు.

నేను నాది అని అనుకునే అజ్ఞాని నేనే బ్రహ్మను అని గ్రహించ గలగటమే పరబ్రహ్మ తత్వము. నేనే బ్రహ్మను అని గ్రహించగలిగిన వాడే జ్ఞాని. అహం బ్రహ్మాస్మి అని వల్లించినంతమాత్రంచేత వాడు బ్రహ్మ అవుతాడా? అది అనుభవపూర్వకముగా గ్రహించగలగాలి. అలా గ్రహించగలిగినవాడే జ్ఞాని. అహం బ్రహ్మాస్మి అని తాను భావించినప్పుడు, వాడి ఎదుట వున్నవాడు గాడిద అవుతాడా? కాబట్టి తాను స్వయం ప్రకాశ స్వరూపుడై అందరినీ ప్రకాశింపజేస్తాడు. అందరినీ ప్రకాశింపజేసేవాడికి తనకు భిన్నంగా ఏం కనబడుతుంది?" అన్నారు శ్రీబాబు.

# అమ్మమాట

-జపమాల ప్రసాద

## ఏది అంటరానిది?

అన్నిటికంటే అత్యున్నతమైన స్థానం 'గురుస్థానం', గురువునెవరు ఆశ్రయిస్తారో వారికి సకల దేవతా తత్త్వాన్ని పొందిస్తారు గురుమూర్తి. ఆ భగవంతుడిని మనం గురుమూర్తిలోనే దర్శిస్తాం. ఇంకా పైకి వెళితే, సాధన ద్వారా ఆ దేవుడు మనలోనే వున్నాడని తెలుసుకుంటాం. గురుమూర్తి ప్రేమానుగ్రహ కటాక్షం వలన మన యొక్క మనో, బుద్ధి, చిత్త, అహంకారములు - సత్యం, శాంతి, దయ, ప్రేమలుగా మారిపోతాయి. అప్పుడు ధర్మం మనలో నాలుగు పాదాలా నడుస్తుంది.



**దేహో దేవాలయ ప్రోక్తః। జీవోదేవ స్సదాశివః।**
**త్యజేత్ అజ్ఞాన నిర్మాల్యం। సోహం భావేన పూజయేత్॥**

అని చెబుతోంది స్కందోపనిషత్. ఈ దేహమే దేవాలయం; దానిలోని జీవుడే సదాశివుడని మానవుడు ఎప్పుడు తెలుసుకుంటాడు? ఎప్పుడైతే తనలోని అజ్ఞానమనే నిర్మాల్యం తీసివేసి, '**సోహం**' - 'అది నేను' అంటే ఆత్మ వస్తువు నేను గానీ, ఈ కనిపించే దేహం నేను కాదు అనే భావనతో నిరంతరం ఎవరైతే పూజ చేస్తారో, ధ్యానం చేస్తారో, ఆ ప్రకారంగా తన ఆచరణ ద్వారా అది అనుభవానికి తెచ్చుకుంటారో వారికి తెలుస్తుంది అసలు సత్యం. ఎలా తెలుస్తుంది? గురుమూర్తి కృప వలన, గురువాజ్ఞ తు.చ. తప్పకుండా పాలన చేయడం వలన అది తెలియబడుతుంది. **'స్నానం మనోమల త్యాగః శౌచమింద్రియ నిగ్రహః'** అని కూడా చెబుతోంది ఈ ఉపనిషత్.

ఇప్పుడు బజారులో ఎన్నో రకాల సబ్బులు వస్తున్నాయి. కానీ అవిఏవీ మన మనోమలాన్ని శుభ్ర పరచలేవు. మనో మలాన్ని శుభ్రపరిచేది ఒక్క గురులక్ష్యార్థమే. నిరంతరం గురునామ (లక్ష్యార్థ) స్మరణ చేయడమే స్నానం. ఇంద్రియ నిగ్రహం కలిగి వుండటమే శౌచం (మడి). అందుకనే మహాత్ముల సన్నిధిలో దివ్య పరిమళం వెదజల్ల బడుతూ వుంటుంది. ఎందుకంటే వారు నిరంతరం 'బ్రహ్మ భావన' లోనే వుంటారు

కనుక. ఇక్కడ మీకొక కథ చెబుతాను. ఇది శ్రీబాబూజీ చెప్పారు.

'పూర్వం గౌరాంగుడు (అంటే చైతన్య మహాప్రభువు) తన తల్లి ఎంతో మడిగా నీళ్ళు తెచ్చుకుంటున్న సమయంలో, వారింటికి వచ్చిన బిచ్చగాడికి భిక్షవేస్తూ, అతనిని తాకుతాడు. అది చూసి గౌరాంగుడి తల్లి, 'అయ్యయ్యో! అంటరానివాడిని అంటావే! నన్ను తాకవద్దు' అంటుంది. అప్పుడు గౌరాంగుడు, 'అమ్మా! ఏది అంటరానిది? అతడిలోని రక్తమా? అదయితే, అదే రక్తం నీలోనూ, నాలోనూ కూడా ప్రవహిస్తోందే! లేక అతని చర్మమా అంటరానిది? మరి నీకూ, నాకూ కూడా అటువంటి చర్మమే కదా వున్నది! లేక అతనిలోని 'ఆత్మ' అంటరానిదా? ఆత్మకు అవధులు లేవుగా? పిపీలికాది బ్రహ్మ పర్యంతము, సకల చరాచర వస్తుజాలమంతా నిండి యున్నది కదా! ఇక ఏది అంటరానిది?' అని తన తల్లిని ప్రశ్నించిన ఏడేళ్ళ బాలుడైన గౌరాంగుడు ఆమె కళ్ళు తెరిపించాడు.

పరిశుభ్రత కోసం ఈ బాహ్య స్నానాలు అవీను. ఎప్పుడూ భగవద్దృష్టిలో వుండటమే నిజమైన మడి. నీకు మైల వచ్చిందని నువ్వు చెబితే ఇతరులకు తెలుస్తుందిగానీ, లేకపోతే ఎలా తెలుస్తుంది? ఒకవేళ నువ్వు చెప్పకపోయినా, నీ మనస్సులో ఆ భావన నిన్ను దొలిచేస్తుంది కదా! కనుక నీలో ఆ భావన వుంటే మైల వుంది. ఆ భావనే లేకపోతే మైలే లేదు. అందుకనే మైత్రేయి అంటుంది '**మృతా మోహ మయీ మాతా। జాతో బోధమయ స్సుతః । సూతక ద్వయ సంప్రాప్తౌ కథం సంధ్యాముపాస్మహే?** - 'మోహమనే తల్లి చచ్చిపోయింది. జ్ఞానమనే పుత్రుడు పుట్టాడు. ఈ విధంగా అనుక్షణం నాకు రెండు విధాలుగా సూతకం సంప్రాప్తమవుతుంటే ఇక నేను సంధ్య ఎప్పుడు వార్చను?' అన్నదావిడ. అది నిత్యమడి! అది మహాత్ములకే చెల్లు. ఆ స్థితి రానంతవరకూ 'అశౌచం' ఆచరించవలసిందే!

ఈ దేహానికి అనేక బాధలు వస్తూ వుంటాయి. వాటినన్నింటినీ చిలకకొయ్యకి తగిలించి, ఇక్కడ సత్సంగంలో వచ్చి కూర్చుని శ్రద్ధగా విని, విన్నదానిని మననం చేసుకుని, ఆచరణలో పెడితే ఆనందం లభిస్తుంది. మన మనస్సుకి ఎలా బుద్ధి చెప్పాలో మనకి మనమే నేర్చుకోవాలి. జాతి, నీతి, కుల, గోత్రాలను మరచి, సత్సంగంలో మనసునుంచాలి.

అసత్యమును విడిచివేసి, సత్యవస్తువును ఆశ్రయించాలి. సత్యాన్ని గుర్తించాలి. అందుకే మనం ప్రతినెలా సత్సంగం జరుపుకుంటున్నాము. ఇది ప్రత్యక్ష పరమేశ్వరులైన గురుమూర్తి సంచరించిన పవిత్ర క్షేత్రం. మనం అనుకున్నా, అనుకోకపోయినా, ఇది స్వర్గసీమే. మనం మనసారా పిలిస్తే, ఆ గురుమూర్తి ఆనందం ప్రసాదిస్తారు.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**సెప్టెంబర్ 2020**

2 బుధ - భాద్రపద పౌర్ణమి - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

12శని-శ్రీగురుదశమి-సా॥5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

**అక్టోబర్ 2020**

1 గురు - అధిక ఆశ్వీయుజ పౌర్ణమి సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

12 సోమ - శ్రీగురుదశమి - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

24 శని - దుర్గాష్టమి, మహర్నవమి - ఉదయం 11గం. శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

25 ఆది - విజయదశమి - ఉ ॥ 11 గం. శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

31 శని- ఆశ్వీయుజ పౌర్ణమి - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

# గుర్వష్టకమ్

(గత సంచిక తరువాయి) - వారణాసి కాళీప్రసాద్ (అమెరికా)

**గురోరష్టకం యత్పఠేత్ పుణ్యదేహీ**
**యతి ర్భూపతిర్ బ్రహ్మచారీ చ గేహీ।**
**లభేత్ వాంఛితార్థం పరబ్రహ్మ సౌఖ్యం**
**గురోరుక్త వాక్యే మనో యస్య లగ్నం॥**

'గుర్వష్టకాన్ని పఠించిన వారెవరైనా, బ్రహ్మచారులైనా, గృహస్థులైనా, భూపతులైనా లేక యతులైనా పుణ్యాత్ములై పునీతులవుతారు. వారందరి అభీష్టములు సిద్ధించి, గురుపాదముల యందు మనస్సు నిలిపినవారై బ్రహ్మపదాన్ని పొందుతార'న్నది ఈ శ్లోకం యొక్క తాత్పర్యం.

అష్టకానికి చివరిదైన ఈ శ్లోకాన్ని ఫలశృతిగా భావించవచ్చు. అయితే లోతుగా పరిశీలిస్తే అన్ని శ్లోకముల సారాంశాన్ని సంగ్రహంగా వివరించడమే గాక, ఇంతకుముందు ప్రస్తావించిన ప్రశ్నలకు సమాధానాన్నీ, దానిని పొందవలసిన మార్గాన్ని కూడా ఈ శ్లోకం వివరిస్తోంది.

***గురోరష్టకం యత్పఠేత్ పుణ్యదేహీ***
***యతి ర్భూపతిర్ బ్రహ్మచారీ చ గేహీ।***

అన్ని ఆశ్రమ ధర్మాలలో వున్న వారందరికీ ఈ శ్లోకం దారిని చూపుతుంది. శంకరులు వివేక చూడామణిలో

***దుర్లభం త్రయమేవైతత్ దైవానుగ్రహ హేతుకం***
***మనుష్యత్వం ముముక్షుత్వం మహాపురుష సంశ్రయః*** - అని వివరించారు. అదే విషయాన్ని మరోసారి ప్రస్తావించారా అన్నట్లు, మనుష్య జన్మమెత్తి ముముక్షువులైన ప్రతి ఒక్కరికీ గురుపాదాశ్రయము మహాపురుష సంశ్రయం అవసరమనీ, అది లభించిన వారే పుణ్యదేహులని శంకరులు వివరించారు. అరుదైన మానవజన్మ యొక్క ఆశయాన్ని మరువ వద్దన్న హెచ్చరిక ఇందులో ధ్వనిస్తుంది. భిన్నమైన ఆశ్రమ ధర్మాలలో వున్న బ్రహ్మచారి, గృహస్థు, భూపతి, యతి (సన్న్యాసి) ఇత్యాదులందరికీ ధర్మాలు వేరువేరుగా కనిపించినా, వారందరి స్వధర్మము సత్యవస్తువు యొక్క అన్వేషణ మాత్రమే. అష్టకములో ముందు వివరించిన శ్లోకాలలో

సహజంగా మనుషులను బంధించే సంబంధ బాంధవ్యాలు, ధనధాన్యాదులు, భోగభాగ్యాలు, కామినీ కాంచనాదుల ప్రస్తావన ఈ నాలుగు ఆశ్రమాలలో వున్న ఎవరో ఒకరికి వర్తించేదే. వాటన్నిటినీ తృణీకరించి భక్తివైరాగ్యాలతో కూడిన మనస్సును 'తతఃకిమ్?' అని నిలదీసిన వారికే గురుపాదోన్ముఖులయ్యే అదృష్టం కలుగుతుందని ఈ శ్లోకం వివరిస్తోంది.

***లభేత్ వాంఛితార్థం పరబ్రహ్మ సౌఖ్యం***

***గురోరుక్త వాక్యే మనో యస్య లగ్నం ॥***

గురుపాదములు పట్టినవారికి ఇహపరమైన కోరికలు తీరడమేకాక, అసలైన వాంఛితార్థమైన బ్రహ్మపదము కూడా దొరుకుతుంది. వాంఛితార్థమన్న పదము బాహ్యపరమైన కోరికలకు అతీతమైన ప్రయోజనాన్ని సూచిస్తుంది. అది అందరికీ అందదనీ, గురుబోధ యందు మనసు లగ్నం చేయగలిగిన వారే దానికి అర్హులనీ మనశ్చే యస్యలగ్నం అంటూ శంకరులు వివరించారు.

ఈ అష్టకం యొక్క సారాంశాన్ని సంగ్రహంగా పరిశీలిస్తే ప్రాపంచిక విషయాదుల పట్ల వైరాగ్యముతోనూ, గురు పాదముల యందు భక్తితో 'తతఃకిమ్?' అన్న ప్రశ్నతో సాధనా మార్గంలో పురోగమించడమే సాధకుడి లక్ష్యమై వుండాలి. ఆ పురోగతి కేవలం గురుబోధ శ్రవణం వలన మాత్రమే  సాధ్యమవుతుంది. ఆ విధంగా గురుపాదపద్మములను తన మనసు యందు; గురువాక్య పరిపాలనను ఆచరణ యందు వుంచిన సాధకుడు తన గమ్యాన్ని చేరి చివరికి యోగియై 'యోగి హృధ్యాన గమ్యం' అన్న వాక్యానికి సాకార రూపమవుతాడు.

ఇదే విషయాన్ని తెలవిస్తూ శ్రీబాబూజీ మహరాజ్, శ్రవణ, మనన, నిదిధ్యాసలే సాధకుడి కర్తవ్యం అయి వుండాలని బోధించారు. మన హృదయ బాబు అందించిన ఆ సూచనయే సాధకులమైన మనందరికీ విశ్వసించి- తరించడానికి పరమావధి కావాలి.

***సదాశివ సమారంభాం వ్యాస శంకర మధ్యమాం ।***

***అస్మదాచార్య పర్యంతాం వందే గురు పరం పరామ్ ॥***

# గురువు ఆవశ్యకత

సేకరణ- బొంబాయి కృష్ణారావు

సద్గురువు అమ్మ! - భగవంతుడు నాన్న!

ఒక నాలుగు నెలల పిల్లవాడు మంచం మీద పడుకోబెట్టబడి వున్నాడు. ఇంకా నిలబడటం, నడవటం రానివాడు. ఇక మంచం దిగే యోచనే తెలియని వాడు. ప్రక్కనే పడక కుర్చీలో వాళ్ళ నాన్న ఏదో పుస్తకం చదువుకుంటున్నాడు. ఇంతలో పిల్లవాడు మలమూత్రాదులు విడిచాడు. ఆ పొత్తిగుడ్డల్లోనే గుండ్రంగా పొర్లాడాడు. బోర్లా, వెల్లకిలా పడ్డాడు. ముక్కూ, మొహం ఏకం చేసుకున్నాడు. బురదలో చేపపిల్లలా తపతప కొట్టుకున్నాడు. చివరికి తన మురికిని తానే భరించలేక కెవ్వుమని ఏడుపు లంకించుకున్నాడు.

పిల్లవాడి ఏడుపు విని వాళ్ళ నాన్న దగ్గరకు వచ్చాడు. పిల్లవాడు చేతులు పైకెత్తి ఎత్తుకోమన్నట్లుగా, తండ్రివైపు చూస్తూ క్యార్ క్యార్ మన్నాడు. మలమూత్రాదులు ఒళ్ళంతా పులుముకుని దుర్గంధ భూయిష్టంగా వున్న కొడుకుని నాన్న చూశాడు కానీ, ఎత్తుకోలేదు. అంతలో పిల్లవాడి ఏడుపు విని అమ్మ కూడా పరుగెత్తుకుంటూ వచ్చింది.

'ఏమోయ్! వాడు చూడు! ఎలా వున్నాడో!' ఒళ్ళంతా పులిమేసుకున్నాడు అన్నట్లుగా చూశాడు నాన్న! అమ్మని చూస్తూ మరింత గట్టిగా ఏడుస్తూ చేతులు చాచాడు పిల్లవాడు.

అమ్మ .... నాన్నలాగ దూరంగా ఉండిపోలేదు. ఒక్క ఉదుటన వచ్చి పిల్లవాడిని ఎత్తుకుంది. స్నానాల గదికి వెళ్ళి పీట వేసుకుని కూర్చుంది. చీర కుచ్చిళ్ళు మోకాళ్ళపైకి వేసుకుని, పిల్లవాడిని తన కాళ్ళపై పడుకోబెట్టింది. నీళ్ళూ, సున్నిపిండి వేసి చేపపిల్లను రుద్దినట్లు బాగా రుద్ది కడిగింది. ఒళ్ళంతా పొడి తువ్వాలుపెట్టి తుడిచింది. పరిమళాలు విరజిమ్మే గంధపు పొడులేవో రాసింది. బొట్టూ, కాటుక పెట్టింది. వుతికిన జుబ్బా తొడిగింది. బుగ్గన కాస్తంత దిష్టి చుక్క పెట్టి, ఎత్తుకుని బిడ్డను ముద్దాడింది. పిల్లవాడు ఏడుపు ఆపి, కిలకిలా నవ్వుతుండగా తెచ్చి నాన్న చేతికిచ్చింది.

నాన్న చదువుతున్న పుస్తకం తీసి ప్రక్కన పెట్టి, కొడుకును

ఎత్తుకుని ... 'నా తండ్రే! నా బంగారు కొండే! ...' అంటూ ముద్దులు పెట్టాడు. పిల్లవాడు పరమానందంలో మునిగిపోయాడు.

భగవంతుడు నాన్న లాంటి వాడు! మనం మురికిగా వుంటే ఎత్తుకోడు, దగ్గరకు రాడు. రానివ్వడు. సద్గురువు అమ్మలాంటి వాడు! మన దోషత్రయాన్ని (మల, విక్షేప, ఆవరణలు) దూషించడు. మన ఈషణ త్రయాన్ని (దార ధన పుత్ర) చూసి ఈసడించడు. మన వాసనా త్రయాన్ని (లోక దేహ శాస్త్ర) చూసి తన వద్దకు రావద్దని వారించడు.

మన అహంకారాన్ని చూసి అసహ్యించుకోడు. ఓపికగా మన చిత్తాన్ని శుద్ధి చేసి, మన అహంకారాన్ని అణచివేసి, వాసనలను వదలగొట్టి, ఈషణ, ఈర్ష్యాసూయలను దాటించి, నిర్మల విశుద్ధులను చేసి, భగవంతునికి ప్రీతిపాత్రమయ్యేటట్లు చేస్తాడు.

ఎందుకంటే తారతమ్య సాంద్రత సమం కానిదే ఒక పదార్థం మరో పదార్థంలో కలిసిపోదంటుంది భౌతిక **శాస్త్రం**! బ్రహ్మమెంత నిర్దోషమో అంత నిర్మలమైతే తప్ప బ్రహ్మస్వరూపులు కాలేమంటుంది **గీత**! ఎవరెంతగా అన్నా, ఎవరెంతగా విన్నా, ఎంత చదివినా, ఎన్ని శాస్త్రాలు అధ్యయనం చేసినా, సద్గురువుని ఆశ్రయించడం తప్పనిసరి అంటారు **అనుభవజ్ఞులు**!

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా సెప్టెంబర్, అక్టోబర్ 2020 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోనండి.

***సెప్టెంబర్ 2020:*** AS 7151, 7154 to 7156, 7163, 7168, 7169, 7589,7597 8291 to 8340, 8348 to 8358, 8371, 8372, 8377, 8380, 8381, 8387, 8388.

***అక్టోబర్ 2020:*** AS 1109, 1141, 5708, 6575, 6767, 6867, 6953, 7137, 7176, 7178, 7182, 7183, 7389, 7908, 7912, 7920, 7173, 8392, 8395, 8422, 8423, 8428, 8430 to 8432, 8434, 8435, 8437 to 8440, 8442, 8444, 8445, 8447 to 8451, 8453 to 8455, 8457 to 8461, 8464 to 8467, 8469

# మా ఆశ్రమము - శ్రీకాళీవనాశ్రమము

- గోనుగుంట్ల శైలజ

(గత సంచిక తరువాయి)

ఆ ఆసుపత్రి దాటాక మరొక ద్వారం వస్తుంది. అదే పురుషోత్తమ ద్వారం. దానికి కొద్ది దూరంలోనే కుడిచేతివైపు ఆకలిబాధ తీర్చడానికై భోజన ఫలహారశాల ఉంది. కొద్ది దూరం దాటాక ఎడమ చేతి వైపు పిల్లలను తీర్చి దిద్దే పాఠశాల వుంది. ఇక్కడ టీచర్స్ పిల్లలకు లౌకిక విద్యతోపాటు, ఆధ్యాత్మిక విద్యలో కూడా శిక్షణనిస్తారు. చిన్నతనంలోనే ఈ గురుకులంలో విద్యనేర్చినవాడు పెద్దయ్యాక సంఘానికి, తద్వారా దేశానికి ప్రయోజనం చేకూర్చడమేగాక, తమ మనస్సులలో సత్యం, శాంతి, దయ, ప్రేమలతోబాటు సేవా భావం కూడా కలిగి వుంటారు.

ఇప్పుడు ఆశ్రమం మధ్యకు వచ్చేశాము. అంటే ఆశ్రమంలోపలికి వచ్చేస్తున్నాము. కొద్ది దూరంలోనే మరొక ఆర్చి వస్తుంది. అదే కాంతి ద్వారము. లోపలకు అడుగుపెట్టగానే, కష్టమనే పులుపు, వగరులను దిగమ్రింగి, మధురత్వం నింపి, భక్తులకు మధురమైన మామిడి ఫలాలనిచ్చే చక్కటి మామిడిచెట్లు దర్శనమిస్తాయి. అవి దూరం నుండి వచ్చే భక్తులకు సేద తీర్చుకోవడానికి చల్లని గాలితోపాటు చక్కటి నీడను కూడా ఇస్తాయి. వీటిపై కొన్ని జీవరాశులు కూడా నివసిస్తూ వుంటాయి. త్యాగము తప్ప స్వార్థమెరుగని వృక్షములంటే మా గురుదేవులకు చాలా ఇష్టము. ఇవి ధన్య జీవులు!

ఇక్కడ భక్తులు నివసించే చిన్నచిన్న ఆవాసాలు కనిపిస్తాయి. భక్తుల హృదయంలో భగవంతుడు వున్నట్లే, దేవాలయాలన్నీ మధ్యలో వుండి, వాటి చుట్టూ భక్తులు నివసించే ఆవాసాలు వుంటాయి. ముందు దేవాలయాలు, వాటిని నిర్వహించేవారి గురించి తెలుసుకుందాము.

రామలింగేశ్వరాలయము, కాళీమాత ఆలయములు రెండూ కలసి ఒకే చోట వున్నాయి. ఈ దేవాలయానికి ముందు నవగ్రహములు ఆసీనులై వున్నాయి. దక్షిణేశ్వరంలోని కాళీమాత శ్రీరామకృష్ణులచేత ప్రతిష్ఠింపబడి, పూజలందుకుంటున్న ఆ కాళీమాత ఎంత ప్రసిద్ధో, ఈనాడు గురుదేవులచే ప్రతిష్ఠింపబడిన జగన్మాత కూడా అంతే విశిష్ఠిత గలిగిన తల్లి.

అడగగానే అభయప్రదానం చేసే ఆ బోళాశంకరుడే ఈ రామలింగేశ్వరస్వామి. ఈయనకు పూజచేసే పూజారి కూడా అంతేబోళామనిషి. ఈయన పేరు వేంకటరత్నం. భౌతిక శాస్త్రం బోధించడంలో దిట్ట. అంతేకాదు, వేదపఠనంతోపాటు సంగీత, కవిత్వ రచనలలో మేటి, ఉపన్యాసాలివ్వటం, పూజలు చేయడం, చేయించడంలో కూడా దిట్ట. ఇంతవచ్చినా కూడా నిగర్వి. వినయంతో గురువే గొప్ప అని తెలుసుకుని, గురువు చేత 'ఆశ్రమ కవి' అనిపించుకుని, 'రత్నం' అనే పేరును సార్థకం చేసుకుని, విజయేశ్వరుడైనాడు. ఈ ఆలయంలో నిత్యమూ అభిషేకలు జరుగుతాయి. అభిషేక సమయంలో ఆశ్రమ భక్తులే వచ్చి రుద్ర నమకచమకాలు చదువుతారు.

చాలామంది జగన్మాత అంటే నాలుక చూసి భయపడతారు. తప్పు చేస్తే మన అమ్మ అయినాసరే భయంకరంగానే కనిపిస్తుంది. అంతమాత్రం చేత మన అమ్మను కాదనగలమా? మనలను సృష్టించిన ఆ జగన్మాతను తెలిసికోవటం అంత సులభతరమా! మనకు అంత ఆధ్యాత్మిక జ్ఞానమేది? అమ్మ అలా నాలుకను ఎందుకు బయటకు చూపిస్తోందో చాలా మందికి తెలియదు. దానికి కారణం అమ్మ రాక్షస సంహారం చేసి, భయంకర కాళీ రూపంలో వస్తున్నప్పుడు, ఆమెను శాంతింపజేయడానికి ఎవరికీ ధైర్యం లేదు. అప్పుడు అందరూ కలసి పరమేశ్వరుడిని శరణు వేడగా, శివుడు అందుకు అంగీకరించాడు. ఆమె వస్తున్న దారిలో అడ్డుగా పడుకున్నాడు. జగన్మాత చూడకుండా శివుని హృదయంపై కాలు వేసింది. వెంటనే స్పృహలోకి వచ్చిన అమ్మ 'అయ్యో! నాపతిపైనే అడుగు వేశానే!' అని నాలుక కరుచుకున్నది. అది చూసి అర్థం తెలియని మూర్ఖులు తమ స్వార్థం కోసం ప్రజలను మభ్యపెట్టి జంతుబలి ఇప్పించి ఇటువంటి పనులు చేస్తారు. కాని లోకమాత ప్రేమ స్వరూపిణి. చల్లని అభయహస్తంతో, చిరునవ్వుతో మనలను ఎప్పుడూ దీవిస్తూ, కోరినవారి కోర్కెలను తీరుస్తుందని మా గురుదేవులు చెబుతూ వుండేవారు.

- సశేషం

# రామాయణంలో స్త్రీ పాత్రలు -సుషుమ్నా ప్రసాద

## సరమ

లంకలో వున్న రాక్షసాంగనలలో సరమ త్రిజటలా ప్రత్యేకతను సంతరించుకున్న మరొక ఉత్తమురాలు. సరమ పాతివ్రత్య మహిమ వలన విశిష్ఠ శక్తులను గడించిన వనిత. ఆ పావన చరిత లంకలో సీతమ్మకు ఇష్టసఖి.

రావణాసురుని వద్ద విద్యుజ్జిహ్వుడనే మాయావి వున్నాడు. సీతమ్మను లోబరుచుకోవడానికి రావణాసురుడు మాయోపాయాన్ని తలపెట్టాడు. శ్రీరామచంద్రుని శిరస్సును, ధనుర్బాణములను మాయతో తయారు చేయించి సీతమ్మ దగ్గరకు తెచ్చి, సముద్ర తీరాన ప్రయాణంలో ఆదమరచి నిద్రిస్తున్న రామచంద్రుని రాక్షసవీరులు వధించారు. ఇక మూర్ఖపు పట్టుదలను వదలి, తన పొందును కోరమన్నాడు రావణుడు. హనుమంతుని ముక్కలు ముక్కలుగా కోశామని, లక్ష్మణుడు పిరికిపంద లాగా పారిపోయాడని చెప్పాడు.

ఆ దృశ్యాన్ని చూసి నిజమని నమ్మి, నేలమీదపడి పొర్లుతూ హృదయ విదారకంగా విలపిస్తున్న సీతమ్మను చూసి, దయార్ద్ర హృదయం కలిగిన సరమ సమీపించి, సీతమ్మను ప్రేమతో స్పృశించి, ఓదార్చి, తాను రాక్షసరాజు మాటలన్నీ విన్నానని, ఆకాశంలో అదృశ్యంగా త్వరితగతిని ఎందుకు వెళ్ళాడో కూడా తెలుసుకువచ్చానని చెప్పింది. యుద్ధ భూమిలో రామచంద్రుడు ఆదమరచి నిద్రపోవడము, లక్ష్మణుడు పారిపోవడము అనేవి అసంభవము. అదంతా విద్యుజ్జిహ్వుడనే మాయావి మాయా శిరస్సు అని చెప్పి సీతమ్మకు ఊరట కలిగిస్తుంది. శుభప్రదమైన సీతమ్మకు శుభఘడియలు రాబోతున్నాయని చెప్పింది. దుశ్చేష్టుడైన రావణుడిని వధించి, సీతమ్మకు దివ్యానందమును ప్రసాదించడం నిశ్చయమని చెబుతుంది. యుద్ధం అనివార్యమని, రావణుడు మంత్రులతో మంతనాలు జరుపుతున్నాడని తెలియజేసింది.

సరమ ఎంత శక్తిమంతురాలంటే ఆకాశంలో ఆమె వేగాన్ని వాయుదేవుడు, గరుత్మంతుడు కూడా అధిగమించలేరు. రావణుని చర్చలను, మంతనాలను మంత్రుల సలహాలను శ్రద్ధగా విని సీతమ్మకు

తెలియజేస్తుంది. రావణుని తల్లి కైకసి, అనిద్ధుడనే వృద్ధ మంత్రి కూడా సీతమ్మను చెరనుండి విడిపించమని రావణునికి చెబుతారు. కాని మూర్ఖుడు, కాముకుడైన రావణాసురుడు వారి మాటలను పెడచెవిని పెట్టి, యుద్ధానికి సన్నద్ధుడై పతనాన్ని ఆహ్వానిస్తున్నాడని చెప్పింది సరమ. అలా సరమ రాక్షసాంగనలకు భిన్నంగా, సీతమ్మకు ప్రియసఖియైన జాతి రత్నంగా భాసిల్లుతుంది. సరళ స్వభావియై సాత్విక స్వభావంతో ప్రకాశిస్తుంది సరమ.

## భక్తులకు విన్నపము

శ్రీగురుదేవుల అనుగ్రహం వలన భక్తులు పొందిన అనుభవాలను గ్రంథస్థం చేసే ఉద్దేశ్యంతో తమ తమ అనుభవాలను వ్రాసి పంపమని విజ్ఞాపన చేసియున్నాము.

శ్రీగురుదేవుల స్వస్వరూప లయం తరువాత, శ్రీగురుమాత ద్వారా మనకు అనేకవిధాల రక్షణ జరుగుతోంది. అనేక లీలలను వారు చూపిస్తున్నారు. అనేక దివ్యానుభవాలు భక్తులకు కలుగుతున్నాయి.

భక్తులు పొందిన అట్టిఅనుభవాలను భక్తులందరూ పంచుకొనే సంకల్పంతో తలపెట్టిన "శ్రీసద్గురునాధుని దివ్య చరిత్ర - 3" గ్రంథం పేరు మార్చి **"శ్రీ గురు కృప"** అని పేరు నిర్ణయించటం జరిగింది.

అందరూ ఈ మార్పును గమనించి తమ తమ అనుభవాలను సమగ్రంగా వ్రాసి సత్వరంగా పంపమని ప్రార్థిస్తున్నాము. మీ అనుభవాలను అక్టోబరు 2020 నెలాఖరు లోగా పంపగలరు.

# శ్రీశ్రీశ్రీ బాబూజీ మహరాజ్‌వారితో అనుభవాలు

-వి. లక్ష్మీ నరసమాంబ

## ప్రథమ దర్శనం

అది నేను ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంలో ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో జాయింట్ డైరెక్టర్‌గా రిటైర్ అయిన సంవత్సరం అంటే 2005. అంతవరకూ ధవళేశ్వరం, కర్నూలు, నాగార్జున సాగర్‌లో హైదరాబాద్‌లో వున్న నా కుటుంబానికి దూరంగా వుంటున్నాను. అంటే 1998లో నా భర్త చనిపోగా, ఆ తదనంతరం నా కొడుకు, కోడలు హైదరాబాద్‌లో స్వంత ఇల్లు, 30 సం॥ల కుటుంబ జీవితం, బాధ్యతలు అన్నీ ముగిసిపోయి, ఇంక ఏంచేయాలనే ఖాళీతనం - భవిష్యత్‌లో దిశానిర్దేశం లేక అయోమయ స్థితి - తోడులేని ఒంటరితనం నన్ను వెంటాడుతున్న తరుణంలో నంబూరు కాళీవనాశ్రమంతో నాకు పరిచయ భాగ్యం కలిగింది.

నంబూరు ఆశ్రమాన్ని గురించి అంతకుముందు చాలా కాలంగా మా పిన్ని, బాబాయిలు కీ.శే. వారణాసి కోటిసూర్య ప్రభ, సుబ్బరాయ శాస్త్రి (నానయ్య)గార్ల ద్వారా విని వున్నాను. వారు తరచూ నంబూరు ఆశ్రమానికి వెడుతూ వుంటారని, అక్కడి ఆశ్రమ వ్యవస్థాపకులైన శ్రీ హనుమత్ కాళీ వర ప్రసాదబాబుగారిని భగవత్ స్వరూపంగా కొలుస్తారని విన్నాను.

ఒకసారి మా ఇంటికి వచ్చిన పిన్నీ బాబాయిలతో 'బాబూజీగారు కాలధర్మం చెందారుట కదా? మరి ఇప్పుడు కూడా ఆయన లీలా మహత్యాన్ని కనబరుస్తుంటారా?' అని అడిగాను.

అందుకు మా బాబాయి 'అవును. చాలా మందికి ఈ విషయంలో అనుమానం కలుగుతూ వుంటుంది. ప్రస్తుత పీఠాధిపతి, ఆయన శిష్యురాలైన శ్రీశ్రీశ్రీ చంద్రకాళీ ప్రసాద మాతాజీగారి ఆధ్వర్యంలో ఆశ్రమంలోని కార్యక్రమాలన్నీ వారు వున్నప్పుడు జరిగినట్లే జరుగుతూ వుంటాయి. ఆయన మహిమలు అలాగే వ్యక్తమవుతూ వుంటాయి' అన్నారు.

'మరి మాతాజీగారు .........?'

'మాతాజీగారు, మేమూ - అంతా ఒకప్పుడు ఆయన శిష్యులమే! చెప్పాలంటే, వారికి మృదంగం నేనే నేర్పాను. కానీ, అది గతంలో ...... ఇప్పుడు వారు పీఠాధిపతి - గురుస్వరూపులు. నేను భక్తులలో ఒకడిని' అన్నారు. అప్పటి నుండి విజయవాడ - గుంటూరు మధ్యలో వున్న నంబూరు ఆశ్రమం చూడాలని మనస్సులో గట్టిగా అనుకున్నాను.

-సశేషం

## పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు

**సెప్టెంబర్ 2020**

2 బుధ - భాద్రపద పౌర్ణమి - శ్రీ సద్గురుపాదపూజ.

12 శని - శ్రీగురుదశమి - శ్రీసద్గురుపాదపూజ.

**అక్టోబర్ 2020**

1 గురు- అధిక ఆశ్వీయుజ పూర్ణిమ - శ్రీ సద్గురుపాదపూజ, భక్తసమారాధన.

12 సోమ - శ్రీగురుదశమి - శ్రీసద్గురుపాదపూజ.

17 శని - శ్రీదేవీ శరన్నవరాత్రులు ప్రారంభం.

21 బుధ - మూలా నక్షత్రం - సరస్వతీపూజ

23 శుక్ర - దుర్గాష్టమి

24 శని - మహర్నవమి

25 ఆది - విజయదశమి

31 శని - నిజ ఆశ్వీయుజ పౌర్ణమి - శ్రీసద్గురుపాదపూజ

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు, ఆశ్రమ స్థిరనివాసులు అయిన శ్రీమతి చంద్రాభట్ల కామేశ్వరమ్మగారు 5-8-2020 బుధవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 84 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.


ఆశ
మధుప
ఇక్కడికి కోతులు వచ్చే అవకాశం ఎక్కువ. ఈ జాడీని ఇక్కడే పాతిపెడతాను.
1
వీటిని చూస్తే కోతి తప్పకుండా వస్తుంది.
2


ఇక్కడెవరో ఇంత తిండి పారేసుకున్నారు. ఇవాళ మనకి పండగే!
3


ఇవన్నీ భలే బాగున్నాయి. ఆ! అక్కడ నేలలో ఇంకా చాలా తిండి ఉంది.
4


నేను నా రెండు
చేతుల నిండా
కావలసినన్ని
తీసుకుంటాను.
5


ఇదేదో వేటగాడి పనిలా
ఉంది. నేను త్వరగా
ఇవన్నీ తీసుకొని
పారిపోవాలి. కానీ
ఇందుల్లో నుండి
నన్నెవరో పట్టుకుని
లాగుతున్నారే!
ఇప్పుడెలా?
6


దొరికావు దొంగా!
ఇవాళ నా పంట
పండింది.
7


చూశారా పిల్లలూ! ఆ
కోతి తన కడుపు
నిండినా తృప్తిపడక
ఆశతో తన
చేతులనిండా చాకెట్లు
తీసుకుని ఆ జాడీలో
చేతులు
ఇరికించుక్కుంది. పైగా
తనను లోపలినుంచి
ఎవరో పట్టుకున్నారని
అనుకుంటోంది. ఆ
చాక్లెట్లు వదిలేస్తే తను
తేలికగా
తప్పించుకోగలిగేది.
అలాగే మానవుడు
మితిమీరిన ఆశతో
తనకుతానే
బంధింపబడి తనను
ఈ సంసారం
బంధిస్తోందని
ఏడుస్తాడు.
8

# బ్రాహ్మణుడు

-పాలూరి కాళీప్రసాద్

(గత సంచిక తరువాయి)

మనం ఎటువంటి వారమైనా, ఎంతటి అజ్ఞానంలో వున్నా, భగవంతుడు ప్రతి వారికీ వారివారి జీవితాలలో తమ తప్పును గుర్తించి, సరిదిద్దుకునే అవకాశాన్ని తప్పక ప్రసాదిస్తాడు. అందివచ్చిన ఆ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోకుండా జారవిడుచుకుంటే ఇంక నీవు సంపాదించిన పాండిత్యానికి సార్థకత ఏమున్నది? అయితే అట్టి అవకాశాన్ని ఎవరు ఎలా వినియోగించుకుంటారు అన్నది వారి వారి సంస్కారాన్ని బట్టీ, వాసనా పరంపరను బట్టి వుంటుంది.

శ్రీగురుదేవుల దివ్య చరిత్రలో ఇలా ఒకే పరిస్థితులలో ఒకే రకమైన అవకాశాన్ని పొందిన ఇద్దరిలో ఒకరు దానిని చక్కగా అందిపుచ్చుకుని, తమ జన్మను చరితార్థం చేసుకుంటే, ఇంకొకరు దానిని వ్యర్థం చేసుకుని భంగపడ్డారు. అదేమిటో కొంచెం చూద్దాం. కులమతాల పేరిట తోటి మానవులను నీచంగా చూడటాన్ని శ్రీ గురుదేవులు ఎన్నడూ హర్షించేవారు కాదు. వారి సన్నిధిలో అందరూ సమానులే. శ్రీగురుదేవుల భక్తకోటి అంతా అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ ఒకే కుటుంబం. కేవలం తోటి భక్తులనే కాక, సృష్టిలోని సకల జీవరాశులను సోదర భావంతో చూడటం వారు నేర్పిన సంస్కారం. ఇక మన రెండు ఉదాహరణలకు వస్తే, ముందుగా శ్రీ లలితానంద సరస్వతి స్వామినివారు మొదటిసారి శ్రీగురుదేవుల దర్శనార్థం రాజమండ్రి వచ్చినప్పుడు అక్కడ భక్తులంతా జాతి నీతి కుల గోత్రాలకతీతంగా సహపంక్తి భోజనం చెయ్యడం చూడగానే వారికి ఎబ్బెట్టుగా అనిపించింది. కానీ వెంటనే తమలోని వివేకాన్ని మేల్కొలిపి, ఇదే అసలైన వేదాంత విజ్ఞాన సారానికి ఆచరణాత్మక రూపమని గ్రహించి, సర్వభూతాత్మకుడైన పరబ్రహ్మను దర్శించే సాధనచేసి, ఆ తరువాత కాలంలో కూడా తమ విజ్ఞాన సర్వస్వాన్ని స్త్రీ పురుష, వర్ణాశ్రమ భేదాలకతీతంగా సర్వులకు సమానంగా పంచిపెట్టి చరితార్థ

-సశేషం

# అశ్రునివాళి

- పాలూరి కాళీ ప్రసాద్

శ్రీ కాళీవనాశ్రమ ఆస్థాన గాయని శ్రీమతి కామేశ్వరమ్మగారు ఆగస్ట్ 5, 2020 న శ్రీ సద్గురు సాయుజ్యం పొందారు. ఆమె చిన్న వయస్సులోనే భర్తను పోగొట్టుకుని, నలుగురు సంతానాన్ని ఎలా పెంచాలో తెలియని స్థితిలో శ్రీగురుదేవులను ఆశ్రయించి, వారి ప్రోద్బలంతో సంగీత శిక్షణ ఆరంభించారు. అయితే, తాము నేర్చుకున్న ఆ సంగీతం తమకు మంచి సంపాదన మార్గంగా మారే అవకాశం వచ్చినప్పుడు 'వెళ్ళాలా? వద్దా?' అనే ద్వైదీ భావనలో వున్నప్పుడు, శ్రీగురు దేవులు 'నిధి చాలా సుఖమా? రాముని సన్నిధి సేవ సుఖమా?' అనే త్యాగరాజ కృతిని గుర్తు చేసి ఆమెకు మార్గదర్శనం చేశారు. ఆ విధంగా గురువాక్యాన్ని వివేక బుద్ధితో గ్రహించి, గురుపాద సన్నిధినే ఎంచుకున్న సాధన సంపన్నురాలు ఆమె. కొన్ని దశాబ్దాల కాలం ప్రతిరోజూ సుప్రభాతం మొదలుకొని ఉభయ సంధ్యల ప్రార్థన, సంకీర్తన, పూజాదికాలలో కామేశ్వరమ్మగారి శ్రావ్యమైన కంఠస్వరం వినడం, ఆశ్రమవాసులకు నిత్యానుభవమే. శ్రీగురుదేవుల స్వస్వరూప లయం భక్తులందరిలాగే ఆమెనూ ఆశనిపాతమై తాకినా, ఆ వెనువెంటనే తమ చిన్న కుమార్తె కూడా శ్రీగురుసాయుజ్యం పొందినా, ఆ బాధలను దిగమ్రింగుకుని ఆశ్రమ సేవలోనే తమ జీవితాన్ని పునరంకితం చేసుకున్న స్థితప్రజ్ఞురాలు ఆమె.

పెద్దగా చదువుకోక పోయినా, శ్రీ లలితానంద సరస్వతీ స్వామిని వారి శిక్షణలో ఆరితేరి, శ్రీరామలింగేశ్వరస్వామివారి నిత్యపూజలలో ముఖ్య భూమిక పోషించడమే కాక, ముకుందమాల, శ్రీమద్భాగవతం, మహర్షుల చరిత్రల పఠనాది సేవలు అనేకం ఆమె ఎంతో శ్రద్ధతో నిర్వహించారు. తమ సంగీత జ్ఞానాన్ని నిర్మలమైన భక్తితో మేళవించి, ఆ సన్మార్గంలో తాము పయనించడమే కాక, ఆశ్రమ వాసులందరికీ స్ఫూర్తి దాయకురాలై నిలిచారు. గత కొద్ది సంవత్సరాలుగా కంటిచూపు దాదాపుగా కోల్పోయినా, ఆ లోపం తమ భగవత్సేవకు ఏమాత్రం అడ్డుకాదని నిరూపించిన శ్రీమతి కామేశ్వరి ప్రసాదవారు మనందరికీ ఆదర్శప్రాయులు! భగవత్సేవలో తాదాత్మ్యం చెంది, అద్వైతానుభూతిని పొందే తేలికమార్గం సంకీర్తన అని నమ్మి, తమ జీవితాన్నే ఆ సంకీర్తనకు అంకితం చేసిన ఆమె అంత్యకాలం సమీపించిన క్షణాలలో కూడా ఆ సంకీర్తనలనే వింటూ ఆనందమయ జీవనులైన సద్గురుమూర్తిలో లయమై పోవడం తాము నమ్మిన మార్గం పట్ల ఆమెకున్న నిబద్ధతను కళ్ళకు కట్టింది. సమర్థ సద్గురు మాసపత్రిక తరఫున ఆమెకిదే మా అశ్రునివాళి!!

# ఎవరు అమరుడు?

(గత సంచిక తరువాయి)

-సుషుమ్నా ప్రసాద

శ్రద్ధతో విన్న కబన్ధి మహర్షితో 'గురుదేవా! ఆ సూర్యుని సర్వవ్యాపక స్వరూపాన్ని గురించి తెలుసుకోవాలని కుతూహలంగా వుంది' అన్నాడు. మహర్షి సమాధానం చెబుతూ 'సూర్యుడు అనంత స్వరూపుడు. అనంత కిరణాలు కలవాడు. కాబట్టే ఈ విశాల జగత్తులో సర్వత్రా ఆ కిరణాలు ప్రకాశిస్తున్నాయి. సూర్యుడు జ్ఞానవంతుడు. సమస్త ప్రాణులకు ఆశ్రయ స్వరూపుడు. అతడు జగన్నేత్రుడు. ప్రాణులకు ప్రాణమైన అగ్ని (ప్రాణాగ్ని) సూర్యుని తేజోరూపంలో ఒక చిన్న కణం.' అన్నారు.

'ఆ సూర్యుని ఏ స్థితిలో ఈ ప్రాణి పొందగలుగుతుంది?' అని కబన్ధి తిరిగి ప్రశ్నించాడు. దానికి మహర్షి బదులుగా 'కబన్ధీ! సూర్యుని చేత నిర్మితమైన సంవత్సరాన్నే నీవు ప్రజాపతిగా తెలుసుకో. ఆ ప్రజాపతికి ఉత్తరాయణం, దక్షిణాయణం అనే రెండు మార్గాలు వున్నాయి. ఎవరైతే తమ సాంసారికాభివృద్ధికై కర్మనిష్ఠులై, యజ్ఞయాగాదులు, దానధర్మాలు, దైవపూజ, వైశ్వదేవం మొదలగు సత్కర్మలు ఆచరిస్తారో, వారంతా దక్షిణాయన మార్గం ద్వారా చంద్రలోకం చేరి, స్వర్గసుఖాలు అనుభవించి, పుణ్యం క్షీణించగానే పునరపి జననం, పునరపి మరణం తిరిగి ఉద్భవిస్తూ వుంటారు. దీనిని మృత్యు మార్గము లేదా పితృయానము అని కూడా అంటారు. ఈ మార్గగాములు జనన మరణమనే వలయంలో చిక్కుకుంటారు.

ఎవరైతే బ్రహ్మచర్యం, తపస్సు, శ్రద్ధ, ఆత్మజ్ఞానం ద్వారా ఆత్మసాక్షాత్కారానికై కృషిచేస్తారో ప్రాణరూప సూర్యుని వాస్తవిక రూపాన్ని తెలుసుకుంటారో, వారు ఉత్తరాయణ మార్గం ద్వారా పయనించి, సూర్యలోకాన్ని చేరుతారు. భయము, నాశనములకతీతమైనది సూర్యలోకము. ఎవరీ లోకమును పొందుతారో వారికి తిరిగి జన్మలేదు. ఇది అతి శ్రేష్ఠమైన, భయరహితమైన గతి. ఈ స్థితిని అజ్ఞానులెప్పుడూ పొందలేరు. సూర్యునిలోనే సమస్త చరాచరమైన జగత్తు ప్రతిష్ఠితమై, రథచక్రాలమాదిరిగా నిరంతరమూ తిరుగుతూ వుంటుంది. చరాచర సృష్టికి ఈ సూర్యరూప బ్రహ్మకు స్థూల, సూక్ష్మ రూపాలనే రెండు రూపాలతో కారణ మవుతోంది. అదే ఏకమాత్ర కారణం. అన్నమే ప్రజాపతి. అన్నం నుండే రేతస్సు కలుగుతున్నది. ఆ రేతస్సు నుండే ప్రజలు ఉద్భవిస్తున్నారు.'

అని బోధించారు. ఈ సమాధానంతో కబన్ధి సందేహ నివృత్తి కలిగి, కృతజ్ఞతా భావనతో గురుపాదారవిందములకు నమస్కరించి, వినమ్రతతో గురుపాద ధూళిని తన శిరస్సుపై జల్లుకున్నాడు.

ఆ సంభాషణమంతా శ్రద్ధగా విన్న భార్గవుడు (విదర్భ ఋషి కుమారుడు) వినయ విధేయతలతో పిప్పలాది మహర్షిని ఈ విధంగా ప్రశ్నించాడు..... 'హే భగవాన్! దేహాన్ని ధరింపజేసే దేవతలెందరు? వారిలో ఈ శరీరాన్ని ప్రకాశింపజేసే వారెందరు? వారిలో శ్రేష్ఠులెవరో కరుణించి తెలియజేయ'మన్నాడు.

పిప్పలాది మహర్షి వాత్సల్య దృక్కులతో ఇతని ప్రశ్నలకు సమాధానమిచ్చాడు 'ఓ భార్గవ మునీ! ఆకాశం, వాయువు, జలము, అగ్ని, భూమి అనే పంచభూతములు, వాక్పాణి, పాద, పాయూపస్థ అనే పంచకర్మేంద్రియాలు, త్వక్, చక్షు, శ్రోత్ర, జిహ్వ, ఘ్రాణాలు అనే పంచ జ్ఞానేంద్రియములు, మనో, బుద్ధి. చిత్తము, అహంకారములనే అంతఃకరణ చతుష్టయము కలసి పంతొమ్మిది దేవతలు ఈ శరీరాన్ని ధరిస్తున్నారు. అందరూ పరస్పర సహకారంతో ఈ శరీరాన్ని ప్రకాశింపజేస్తారు.

కానీ, వీరిలో ఎవరికివారే మేమే శ్రేష్ఠులమంటూ, అహంకరించి చెప్పుకోసాగాయి. వీరి స్వాతిశయాన్ని చూసి, శ్రేష్ఠమైన ప్రాణం ఇలా ప్రబోధించింది 'మీరే శరీరాన్ని ధరిస్తున్నట్లు అహంకరించ వద్దు. నేను (ప్రాణం) ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానాలనే అయిదు భూమికలతో ఈ శరీరాన్ని ధరిస్తున్నాను' అని చెప్పింది. ఆ పంతొమ్మిది దేవతలు అందుకు సమ్మతించకపోవడంతో, ప్రాణం శరీరాన్ని విడిచిపైకి పోయినట్లు నటించింది. అంతే. మిగిలినవన్నీ ఎక్కడివక్కడే అచేతనమయిపోయాయి. అది ఎలాగంటే రాణీ ఈగ తేనెపట్టును విడిచిపెట్టి పోతే మిగిలిన ఈగలన్నీ వెళ్ళిపోయినట్లు ప్రాణం శరీరాన్ని వీడగానే, ఈ పందొమ్మిది నిర్వీర్యమై, శరీరాన్ని విడిచారు. ప్రాణం మరల వచ్చి, ఈ శరీరంలో ప్రవేశించగానే, ఈ కర్మేంద్రియాలు, జ్ఞానేంద్రియాలు మొదలగు పంతొమ్మిది కూడా వీర్యవంతమై నిలబడి, ప్రాణం విలువ తెలుసుకున్నారు. ప్రాణమే తమకన్నింటికన్నా మూలాధారమని స్తుతించారు.

- సశేషం

# యోగం

సేకరణ - పాలూరి శ్రీరామా రావు

కొందరు కర్మయోగం గొప్పదని, కొందరు భక్తి యోగం గొప్పదని, కొందరు జ్ఞానయోగం గొప్పదని, కొందరు ధ్యాన యోగం గొప్పదని పిడివాదాలు చేస్తూ వుంటారు. నిజంగా ఈ యోగాలు దేనికది ప్రత్యేకమైనది కాదు. ఒక దానికొకటి సమన్వయం చేసుకుంటూ, అన్నిటినీ ఆచరించవలసినదే. భగవద్గీత అన్ని యోగాలకు తగిన స్థానమిచ్చి ఆదరించింది. సాధారణంగా మనం చేసే పనులలో, అన్ని లౌకిక కార్యాలలో కూడా ఈ నాలుగు యోగాలు కలిసి వుండవలసినదే. అలాంటిది పరమ పురుషార్థమైన మోక్షప్రాప్తికి వీటన్నిటి అవసరం లేకుండా ఎలా వుంటుంది?

ఉదాహరణకు వంట విషయాన్నే తీసుకోండి. వంట అనేది మీరు ప్రతిరోజూ చేసే ముఖ్యమైన పని. ఈ పనిలో కూడా నాలుగు యోగాలు కలిసే వుండాలి. ఏ యోగం లోపించినా వంట చెడిపోతుంది.

వంట చేయాలంటే బియ్యం, పప్పు, ఉప్పు, కూరగాయలు అన్నీ సమకూర్చుకోవాలి. కూరగాయలు తరిగి వుంచుకోవాలి. పొయ్యి వెలిగించాలి. పాత్రలు శుభ్రం చేసుకోవాలి. ఇదంతా **కర్మయోగం.**

బియ్యానికి తగినన్ని నీళ్ళు, పప్పుకు తగినంత ఉప్పు, వంటకు తగినంత మంట, వంట చేసే విధానం - ఈ పరిజ్ఞానం వుండాలి. ఇదంతా **జ్ఞానయోగం.**

పాత్రను పొయ్యి మీద పడేసి, వీధిలో కబుర్లు చెప్పుకుంటూ కూర్చుంటే, పాలు పొయ్యి మీద పెట్టి బయట కూరగాయలు బేరం చేస్తుంటే, వంటంతా చెడిపోతుంది. స్టౌ ఆరిపోతుంది. కనుక చేసే పనిమీద నిఘా వుంచాలి. ధ్యాస వుండాలి. ఇదే **ధ్యానయోగం.**

తిట్టుకుంటూ, తిమ్ముకుంటూ, లోకులను ఆడిపోసుకుంటూ చేసిన వంట తిన్నవారికి వంటపట్టదు. అది విషంగా మారిపోతుంది. అందువల్ల ఎంతో ప్రీతితో, ఇష్టంతో వంట చెయ్యాలి. తాను చేసిన వంటను ఇంట్లో అందరూ ఆరగించి, ఆనందించాలి, తృప్తి చెందాలి అని

భావిస్తూ, భగవంతుని స్మరిస్తూ, పవిత్రమైన ఆలోచనలతో వంట చేయాలి. ఇదే **భక్తి యోగం.**

ఈ నాలుగు యోగాలు వంట చేసే వారికే అవసరమవుతుంటే, మరి పరమాత్మ ప్రాప్తికై చేసే సాధనలో ఈ నాలుగు యోగాల అవసరం లేకుండా ఎలా వుంటుంది? నాలుగూ అవసరమే!

కర్మయోగం - నిష్కామంగా, ఫలాసక్తి లేకుండా కర్మలు చేస్తుంటే మనస్సుకు కోరికలనే కల్మషాలు అంటకుండా, నిర్మలము, శుద్ధము అవుతుంది. మనస్సు నిర్మలము, శుద్ధము అయితేనే భగవంతునిపై నిలపడానికి ఆ మనస్సుకు అర్హత కలుగుతుంది.

భక్తియోగం - మనస్సు భగవంతునిపై నిలిస్తే నిరంతరం భగవంతుని స్మరించడం, భగవంతుని మహిమలు తెలుసుకోవడం, నిజంగా భగవంతుడు మనకు చేస్తున్న మేలును తెలుసుకుని కృతజ్ఞతా పూర్వకమైన భక్తిని కలిగి వుండటం జరుగుతుంది.

జ్ఞానయోగం - ఇలా భక్తి భావన వృద్ధి అయ్యే కొద్దీ, అసలు భగవంతుని తత్త్వం ఏమిటి? భగవంతుడు అంటే ఎవరు? నేను ఎవరిని? భగవంతునికి నాకు మధ్య వున్న సంబంధమేమిటి? అసలు ఈ జన్మకు సార్థకత ఏమిటి? ఆ భగవంతుని చేరుకుని, ఆయనతో ఐక్యత ఎలా సాధించాలి? అనే జ్ఞానాన్ని - ఆత్మజ్ఞానాన్ని పొందటం జరుగుతుంది.

ధ్యానయోగం - ఆత్మజ్ఞానాన్ని పొందిన తరువాత ఆ జ్ఞానాన్ని అనుభవంలోకి తెచ్చుకోవడానికి ధ్యానమగ్నులై, విచారణశీలురై, ఈ దేహేంద్రియ మనోబుద్ధుల కన్న వేరుగా వుండి, జడమైన వీటికి చైతన్యాన్ని ప్రసాదించే ఆత్మనైన నేను సర్వత్రా వున్న సచ్చిదానంద స్వరూప పరమాత్మనే అనే అనుభూతిని పొంది, పరమాత్మగా వుండిపోవాలి. ఇదే ధ్యానయోగం. ఇదే జీవ బ్రహ్మైక్యత. ఇదే జీవన్ముక్తి. ఇదే మోక్షం.

ఇలా మోక్షాన్ని పొందాలంటే నాలుగు యోగాలు కూడా అవసరమే. ఈ నాలుగు యోగాల సమన్వయమే భగవద్గీత.

# శ్రీబాబు దివ్యవాణి

(గత సంచిక తరువాయి)

- డా॥ రాఘవేంద్ర. పరుచూరి

మూడవ ఆవరణ చిమ్నీ గ్లాసు వంటిది. దానిలో నుండి చూస్తే, జ్యోతి బాగా కనిపిస్తుంది. కానీ, ఆ దీపం దగ్గరకి వెళ్ళాలంటే గ్లాసు అడ్డుగా వుంది కదా! దానిని కూడా తీసివేస్తే జ్యోతి సంపూర్ణంగా దర్శనం అవుతుంది. అలాగే మనలో వున్న మూడు గుణాలు సత్త్వ, రజ, తమో గుణాలను తీసివేస్తే ఆ మనస్సు సత్యం, శివం, సుందరంగా మారి పోతుంది. అప్పుడు ఆత్మదర్శనం అవుతుంది. అంటే తనకి కావలసిన వస్తువు దొరికింది. ద్వైతం పూర్తిగా నశించిపోయింది. ఈ శక్తి తారక బ్రహ్మముది.

ఏదో నామం అనుకుంటున్నాము, రామకోటి రాస్తున్నాము అనుకోగానే సరిపోదు. తనను తాను మరచిపోవాలి. కబీర్, త్యాగయ్య ఆ నామంలో లయించిపోయి పాడారు. రామ నామము ఎంతో మధురంగా వుంటుంది. అందుకనే మారుతి రామ నామ్ మీఠా హై ! అపనే ఆప్‌కో భూల్ జానా! అంటూ నామమును గ్రోలి తనని తానే మరచిపోయాడు. అంతరేంద్రియాలు, బాహ్యేంద్రియాలు మనోలయం అయిపోయాయి. ఆయనలోని దుష్ట శక్తులన్నీ హరించిపోయాయి. రామనామమనే బ్రహ్మానందంలో వుండిపోయాడు మారుతి. పూర్వం అతడెవరు? మర్కట రూపంలో వున్న అతను ఈ రామనామముతో మహా జ్ఞానిగా మారిపోయాడు. జితేంద్రియుడై వానర రూపముపోయి, వాసుదేవ రూపము పొందాడు. రామ నామము ఎంత గొప్పదో మీరు గుర్తిస్తున్నారా!

ఓం శ్రీరామ జయరామ జయజయరామ. ఏ మంత్రానికైనా ప్రణవం చేర్చకపోతే అది శిరస్సులేని మొండెము లాంటిది. అట్టి ప్రణవం రామనామంతో వున్నది. ఈ ఆనందం ధరణిలో ఏ రుచి ఇవ్వగలదు? ఇది భుజించే కొలది భవరోగాన్ని హరింపజేసేది. ఈ ఔషధాన్ని తినే కొలదీ మానవుడు సదా ఆనందాన్ని పొందుతాడు.

- సశేషం

# కైవల్యోపనిషత్

(గత సంచిక తరువాయి) - రేఖ

**ఉద్ధరేదాత్మనాత్మానం ఆత్మానవసాదయేత్ ఆత్మైవహ్యాత్మనో బంధురాత్మైవ రిపురాత్మనః** - గీతలో 6వ అధ్యాయంలో చెప్పినట్లు - తన మనస్సును తాను జయిస్తే తనకు తానే బంధువు. జయించనిచో తనకు తానే శత్రువు అని అర్థం.

ప్రపంచాన్ని చూస్తున్నప్పుడు మనసు మనసుగా వుంటుంది. ప్రతి ఇంద్రియంతో మనసు కలసి ఆయా ప్రాపంచిక విషయానుభూతులను వ్యక్తం చేస్తుంది. మనకి బాగుందని, బాగుండదని చెప్పించేది కూడా మనస్సే. బయటకు వ్యక్త పరిచేది మనస్సే.

రోజూ వినే సంకీర్తన, లేక పారాయణ, లేక పూజ ఏదైనా సరే మనస్సును ఒక అతీత స్థితికి తీసుకు వెడుతుంది. ప్రాపంచిక విషయాదులకు చాలా సమయాన్ని కేటాయిస్తాము. కానీ, భగవద్విషయానికి, మహాత్ముల బోధకి ఎక్కువ సమయమివ్వడానికి సందేహిస్తాము. అలా కాకుండా భగవద్విషయాన్ని కష్టంగా కాకుండా ఇష్టంగా తీసుకునే మనస్సు ఆ భగవంతుని యొక్క విరాట్ స్వరూపం యొక్క వర్ణన వింటూ, వర్ణించుకుంటూ వుంటే మనసుకి బాగుంది, బాగుండలేదు అనే మాటలు మనకి వినిపించవు. అప్పడు 'అబ్బా! మనస్సు ఎంత హాయిగా వుందో, ఎంత తృప్తిగా వుందో' అంటాం. అప్పుడు అక్కడ హృదయం మాట్లాడుతోంది. హృదయం అనుభవిస్తోంది. బుద్ధి చేత చెప్పిస్తోంది మాటలు. ఈ విషయం వచ్చేసరికి ఇది ఎవరికీ చెందేది కాదు. భగవంతుడి దగ్గరకు వచ్చేసరికి ఒక ఆత్మీయత ఏర్పడుతుంది. భగవంతుడితో తాదాత్మ్యత చెందుతున్నాం. ప్రపంచం వైపు వెడితే మనస్సు ఏడుస్తుంది, నవ్వుతుంది. కానీ భగవంతుడి విషయం వచ్చేసరికి వేదాంత పరిభాషలో కూడా **మనోలయం ముక్తిలయం యదార్థః** అని అంటారు. నిజమైన అనుభూతిని పొందుతున్నప్పుడు, ఎప్పుడైతే మనస్సు లేకుండా పోతుందో అదే ముక్తి! చచ్చిపోయిన తరువాత వచ్చేది కాదు ముక్తి. ఈ దేహంతో వుండగానే మన మనస్సులోనే ముక్తిని పొందాలి.

మనం ప్రపంచంలోనే వుండాలి. కానీ దేనికీ అంటుకోకుండా, ఎంతవరకూ వుండాలో అంతవరకే వుండాలి. దానిలోని సత్యాన్ని

గుర్తించు. ఒక పచ్చని చెట్టు వుంది. అది ఎంతో అందంగా వుంది. అది ఆ రకంగా వుండటానికి కారణం ఎవరు? ఏమిటి? అని. అలాగే ప్రకృతిలోని దేన్ని చూసినా, లోపలికి వెళ్ళి అన్నిటికీ సైన్స్ ప్రకారం, వాతావరణం వలన ప్రకృతి బాగుంటుంది అనుకున్నా, అటువంటి వాతావరణాన్ని సృష్టించింది ఎవరు? అని విచారణ చేస్తే, ఒక అనంత శక్తి దీనికి కారణం అని బోధ పడుతుంది. వాతావరణం కాలుష్యం వలన భగ్నమయినప్పటికీ కూడా ప్రకృతి దాన్ని అది సంరక్షించుకునేటట్లుగా ఆ శక్తి వలనే జరుగుతోంది.

మనం ఒక తాత్కాలికమైన ఆనందాన్ని పొందినప్పుడు, వాక్కుకు అందని ఆ అనుభూతిలో మనోలయం అవుతుంది. ఒక పదార్థం ఎంత తీపిగా వున్నది అంటే చెప్పలేము. ఈ అనుభూతి కూడా అక్షరాలలో చెప్పలేము. మనస్సు ఎంత పవిత్రంగా వుంటుందో అంతటి అనుభూతి వుంటుంది. ఇదివరలో చెప్పినట్లుగా ...

నకర్మణా, న ప్రజయా, త్యాగేనైకేన అమృతత్వమానసుః - త్యాగం ఒక్కదాని వలనే ఈ అనుభూతి వస్తుంది. భోగ భాగ్యాలు, సిరిసంపదలు కాదు త్యాగం చేయవలసినది. నిన్ను నువ్వు త్యాగం చేసుకో. నీలోని విషయాలు, సంకల్పాలు త్యాగం చెయ్యి. ప్రపంచంలో దేనిలో ఎంత వరకు వుండాలో, అంతవరకే వుండి, వైరాగ్య దృష్టిని కలిగి వుండు.

శివానందలహరిలో శ్రీశంకర భగవత్పాదులవారు కూడా చెప్పారు - అత్యంత చపలమైన వారి మనస్సు మర్కటం లాంటి మనస్సును భక్తి అనే త్రాడుతో బంధించి, ఆదిభిక్షువైన శంకరుడికి సమర్పిస్తూ, ఆ స్వామిని తన మనస్సును శంకరుడి ఆధీనం చేసుకోమని ప్రార్థించారు.

షిరిడీ సాయిబాబావారు కూడా భిక్షాటనకు వెడుతూ వుంటే, మంచి చేసినవారూ వున్నారు, రాళ్ళు వేసిన వారూ వున్నారు. కానీ అందరినీ ఒకే రకంగా ఆశీర్వదించేవారు ఏమని? 'అల్లా అచ్ఛా కరేగా! అంటే భగవంతుడు మీకు మేలు చేయుగాక! అనేవారు.

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

**సెప్టెంబర్ 2020**

2 బుధ - భాద్రపద పౌర్ణమి - శ్రీ సద్గురుపాదపూజ.

5 శని - ఉపాధ్యాయ దినోత్సవం.

12 శని - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

16 బుధ - మాసశివరాత్రి.

17 గురు - మహాలయ అమావాస్య

**అక్టోబర్ 2020**

1 గురు - అధిక ఆశ్వీయుజ పూర్ణిమ. శ్రీసద్గురు పాదపూజ.

12 సోమ - శ్రీగురు దశమి. సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ.

15 గురు - మాస శివరాత్రి.

16 శుక్ర - అమావాస్య

17 శని - శ్రీ శరన్నవరాత్రి ప్రారంభం. ఉదయం 7-45 ని॥ అంకురార్పణ.

21బుధ - మూలా నక్షత్రం - సరస్వతీపూజ

23 శుక్ర - దుర్గాష్టమి

24 శని - మహర్నవమి.

25 ఆది - విజయదశమి

26 సోమ - ఏకాదశి - ఏకాహం, దీక్షావిరమణ.

27 మంగళ - శ్రీ సద్గురుపాదపూజ.

31 శని - నిజ ఆశ్వీయుజ పౌర్ణమి - శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన. శ్రీమాతాజీవారి జన్మదిన మహోత్సవం.

(గత సంచిక తరువాయి)

# అత్రి మహర్షి

- రమణ ప్రసాద్

అత్రిమహర్షి అనసూయతో, "నేను తపస్సు చేయటానికి వెళ్ళాలని అనుకుంటున్నాను. నువ్వు నాతో వస్తావా? బిడ్డలతో వుంటావా?" అని అడిగాడు. అప్పుడు ఆమె, "నాథా! ఇంకా పుత్రులు పెద్దవారు కాలేదు. కొంతకాలం ఆగండి. పుత్ర పోషణార్థమై పృథు చక్రవర్తి వద్దకు వెళ్ళి అవసరమైన ధనం తీసుకొని రండి" అని కోరింది. అత్రి, ధనార్థియై పృథువు వద్దకు వెళ్ళాడు. అప్పుడు పృథువు అశ్వమేధయాగము చేస్తున్నాడు. పృథువు అశ్వాన్ని విడిచి దాని సంరక్షణార్థం తన పుత్రుని పంపుతూ, అతనికి సహాయంగా అత్రిమహర్షిని వెళ్ళమని కోరాడు. ఇంద్రుడు అశ్వాన్ని హరించుకు పోతుండగా, అత్రి ఆజ్ఞాపించగా, దేవేంద్రునిపైన పృథు పుత్రుడు బాణం వేశాడు. ఇంద్రుడు అశ్వాన్ని విడిచి పారిపోయాడు. అశ్వమేధ యాగం నిర్విఘ్నంగా పూర్తి అయింది. పృథువు అత్రిమహర్షికి దక్షిణలనిచ్చి తృప్తి పర్చాడు. అత్రిమహర్షి పృథువుని అనేక విధాలుగా కొనియాడాడు. గౌతమ మహర్షి 'ఒక మానవమాత్రుడిని ఇంతగా పొగడటం సబబు కాదు' అని అత్రి మహర్షిని దూషించాడు. అత్రి మహర్షి నా వాక్యములలో దోషం లేదన్నాడు. వీరి వాదములను విన్న సనత్కుమారుడు " 'నావిష్ణుః పృథివీపతిః' కాబట్టి అత్రి పలుకులు ధర్మయుక్తములు" అని తెలుపగా పృథు చక్రవర్తి అత్రిమహర్షిని ధనకనకవస్తు వాహనములనిచ్చి సత్కరించి పంపాడు. ఆ ధనాన్ని పుత్ర సంరక్షణకు వినియోగించి సతీ సమేతంగా తపస్సు చేయటానికి అడవికి వెళ్ళిపోయాడు.

ఒకప్పుడు దేవతలకు జంభాది దైత్యులకు జరిగిన యుద్ధంలో సూర్య చంద్రులు మూర్ఛనందగా లోకం అంధకార బంధుర మయింది. దేవతలు అత్రి మహర్షిని ఈ ఆపదనుండి రక్షించమని వేడగా తన తీక్ష్ణ దృష్టితో రాక్షసుల నాశనం చేశాడు. జగద్ధితార్థం అత్రి మహర్షి అనేక మహత్కార్యాలు చేశాడు.

అరణ్యవాసం చేస్తున్న సీతారామలక్ష్మణుల వద్దకి భరతుడు వచ్చి శ్రీరాముని పాదుకలు తీసికొని నంది గ్రామానికి వెళ్ళిన తరువాత, శ్రీరాముడు భార్య, అనుజులతో అత్రి మహర్షి ఆశ్రమానికి వెళ్ళాడు. అత్రిమహర్షి వారిని ఎంతో గౌరవించాడు. అనసూయ సీతాదేవికి పతివ్రతా ధర్మములు తెలిపి నూతన వస్త్రములను , ఆభూషణములను ఇచ్చి ఆశీర్వదించింది. ఆ రాత్రి సీతారామ లక్ష్మణులు ఆశ్రమంలో గడిపి వెళ్ళిపోయారు.

ఒక సారి ఋషులందరు అత్రి మహర్షితో, "మహాత్మా! నువ్వు విశ్వవిదుడవు. ఋషి శ్రేష్ఠుడవు. దైవములలో ఉత్తమ దైవం ఎవరు? ఏది పరమ ధర్మము? పరమేశ్వరుని అర్చించే విధానం ఏది? మాకు ఈ సంశయాల నివృత్తి చేయండి" అని ప్రార్థించారు.

అత్రి మహర్షి సంతసించి, "ఋషులారా! దేవతలలో శ్రీమన్నారాయణుడే ఉత్తమ దైవం; ఉపవాస, స్వాధ్యాయాదులతో ఆయనను అర్చించటమే పరమ ధర్మం; ఇహాముత్ర సుఖములకాతని అర్చించవమే అర్చనావిధానం. ఈ అర్చన రెండు విధాలు - అమూర్త్యార్చనము, సమూర్త్యార్చనము అని. అగ్న్యాహుతి అమూర్త్యార్చన అని, ప్రతిమార్చన సమూర్త్యార్చన అని తెలియుండి'' అని వుపదేశించాడు. కర్మ, ప్రతిష్ఠ, పూజన, స్వపోత్సవ ప్రాయశ్చిత్తము, అని విభజించి దేవతార్చన విధానాన్ని లోకానికి చాటి తన్మూలంగా లోకానికి తరుణోపాయంగా ప్రసాదించాడు. అదే అత్రి సంహితగా ప్రసిద్ధి పొందింది.

# శ్రీ మళయాళ స్వామి సేకరణ - మురళి

శ్రీ వ్యాసాశ్రమ వ్యవస్థాపకులు, పూజ్య శ్రీ మళయాళ స్వామివారి బోధామృతము -

పరబ్రహ్మ నిష్ఠ సర్వదా ఉండవలెను. ఆత్మ సదా శుద్ధ, బుద్ధ ముక్తమై వుంటుంది. దానికి దేహేంద్రియాలతో ఏ సంబంధమూ లేదు. కనుక కాలభేద విచారము చేయకుండానే బ్రహ్మనిష్ఠ చేయాలి. కాని, శాస్త్రమందు కొంత విరోధము చెప్పి వుండవచ్చు. కర్మకాండ విధిని అనుసరించి బ్రహ్మనిష్ఠులగు స్త్రీలు దేవతార్చన, గ్రంథపారాయణ యజ్ఞయాగాది క్రతువులు, రుద్రాక్ష మాలలతో జపము చేయుట మొదలైనవి శాస్త్ర విరోధము. భగవద్గీత 8వ అధ్యాయములో, 'మరణ సమయంలో ఏయే విచారములు వుంటాయో జీవుడు ఆ స్థితిని తప్పక పొందుతాడు' అని చెప్పబడింది. బహుకాలం బ్రహ్మనిష్ఠలో వున్నా, మరణకాలములో ధ్యానము లేనిచో గొప్ప ఫలము కలగటానికి అవకాశం లేదు. కాబట్టి సర్వకాల సర్వావస్థలయందూ ధ్యానించవచ్చు. ఏ సమయంలో ప్రాణం పోతుందో తెలియటం కష్టం కనుక అశుచిని పాటించక సర్వదా ధ్యానం మరువరాదు. అశుచి కాలమందు కూడా ధ్యానించుట అభ్యాసం చేయాలి. శరీరమందు ఎంత మాలిన్యము వున్నా, అది ఆత్మకు అంటదు.

ఒక్క సూర్యుడు లోకమంతా ప్రకాశింప చేస్తున్నా, లోకము తన యందు ఎట్లు వుండదో, అలాగే ఆత్మ అన్ని జీవరాశులలోనూ ప్రకాశిస్తున్నా, ఆ శరీరాది దోషములు ఆత్మకు అంటవు. జడబుద్ధి కలవానికి దేహమే తాననే బుద్ధి ధృడపడి వుంటుంది. కొంచెం నిర్మల బుద్ధి గలవానికి జీవుడు తాననే బుద్ధి బలపడి వుంటుంది. ఆత్మానాత్మ విచారముచేత బ్రహ్మబోధగల మహాత్మునకు నిత్య శుద్ధ ముక్తుడగు బ్రహ్మమే తాననే బుద్ధి సర్వదా ఆత్మయందు ప్రకాశిస్తుంటుంది - అని వివేకచూడామణిలో చెప్పబడింది.

పంచభూత సమ్మేళనమై మలమూత్ర క్రిమికీటక సంకులమైన దేహము ఎవరిదైనా అశుచియే. శుద్ధమై, ముక్తమై వుండే ఆత్మ సర్వదా పరిశుద్ధంగానే వుంటుంది. ఈ రెండిటి రహస్యం తెలిస్తే శౌచ విధి

ఎవరి కొరకు చెప్పబడిందో అర్థమవుతుంది. ఒకవేళ శౌచాది క్రియలు దేహము నందు జరిపినా, హృదయం శుద్ధి చేయడం ఎవరి తరము? హృదయము నుండి కదా సమస్త ధ్యానములు, వేదాధ్యయనములు, మంత్రోచ్చారణలు జరుగుతున్నాయి? ఆత్మశుద్ధి లేనివాడు ఎన్ని విధాల శుద్ధి చేసినా కూడా అశుద్ధుడే!

పరమార్థ చింతన చేసేవారికి వుండవలసిన శుద్ధి - 1. వాక్ శుద్ధి - అంటే సత్యముగను, భూత హితముగ, మదురంగా పలకటం. 2. మనఃశుద్ధి - అనగా చెడ్డ తలంపులు లేకుండ (విషయ వాసనా రహితమై) వుండటం. 3. చక్షురాదీంద్రియాది శుద్ధి - అనగా నేత్రాదీంద్రియములు వాటి వాటి విషయములగు చెడ్డ వృత్తులలో ప్రవేశించ కుండా వుండటం. 4. సమస్త ప్రాణుల యందు కారుణ్యము కలిగి వుండటం. ఇవియే నిజమైన శుద్ధి.

శ్మశానమందుగాని, మలమూత్ర విసర్జన సమయమందుగాని, స్నాన సంధ్యాది కృత్యములచే శుచితుడు కాకపోయినా, లేక కాలు చేతులు కడుగకుండానే గాని, సర్వేశ్వర స్మరణ, ధ్యాన, కీర్తనములు చేయవచ్చు అని వైశ్వానర స్మృతి చెబుతున్నది. శుచితో కూడిగాని, అశుచిగా వున్నప్పుడుగాని ఎవడు పరమాత్మను ధ్యానిస్తాడో వాడు సంసార మాలిన్యముచేత స్పర్శింపబడడు.

## శ్రద్ధాంజలి

శ్రీబాబు చిరకాల భక్తులు అయిన శ్రీమతి మావులేటి అరుణ కుమారిగారు 11-8-2020 మంగళవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 71 సంవత్సరాలు. సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర

## శ్రీహరిరావు గారితో శ్రీబాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

14-2-1959: శనివారం రాత్రి రామేశ్వరం 9 రోజుల యాత్రకని భక్తులందరితో బయల్దేరి వెడుతూ ఏలూరులో శ్రీహరిగారింటి వద్ద కాసేపు కూర్చున్నారు. శ్రీ బాబు "నేను యిల్లు చిన్నదని చూడను. పవిత్రమైన మనస్సు, నిర్మలమైన భక్తి యివే చూస్తాను. నేను కోరేది పెద్ద మేడలలో కూడా దొరకక పోవచ్చును" అన్నారు. "ఒకసారి హైదరాబాదులో ఒక యింట్లో దిగి మళ్ళీ వెంటనే బయలుదేరి బెంగళూరు వెళ్ళిపోయాను. ఆ యింటి వాళ్ళు తమ వలన ఏమైనా అపరాధం జరిగిందేమోనని భయపడ్డారు. 'అదేమీ కాదు, అమ్మ ఆజ్ఞ అయింది. అంతే' అని చెప్పాను. బెంగళూరులో ఉన్నపుడు ఒక రోజు 'నాగరత్నం' అనే ప్రసిద్ధ గాయని త్యాగరాజ కీర్తనల పాట కచేరికి వెళ్ళాను.



ఆ రాత్రి ఒకరింట్లో గదిలో పడుకుని వున్నపుడు, పెద్ద వెలుగు గది అంతా నిండి పోయింది. తరువాత అదంతా క్రమంగా నాలోనికి వచ్చి చేరినట్లు అనుభూతి కలిగింది. నాకు స్పృహ లేదు. బట్టలు, ప్రక్క తడిసి ముద్దయిపోయాయి. బైట వాళ్ళు తలుపులు కొట్టినా తెలియలేదు. మర్నాటి మధ్యాహ్న సమయం వరకు ఆ దివ్య స్థితిలో ఉండిపోయి, తరువాత తలుపులు తీసుకుని బయటకు వచ్చాను" అని చెప్పారు.

"ఇక యిలా మీ అందరి కోసమూ రాను. ఒక చోటనే స్థిరంగా ఉండిపోతాను. కావాలనుకున్న వాళ్ళు వచ్చి నన్ను చూసి వెళ్ళవచ్చు" అన్నారు శ్రీ బాబు. మరొకసారి భక్తులెవరో ఒక చోటనే తమ వద్దనే ఉండిపొమ్మని కోరారని "నేను అలా ఒక చోటనే ఎలా ఉంటాను? నా కోసం ఎంత మంది ఎక్కెడెక్కడి వాళ్ళూ ఎలా పలవరించి బాధపడుతూ ఉంటారో గదా! వాళ్ళందరిని చూసుకుంటూ, యిలా తిరుగుతూ ఉండ వలసినదే"నని తాము చెప్పామని అన్నారు.

"చిన్నపుడు చాలా సన్నగా ఉండే వాణ్ణి. ఎప్పుడూ పట్టు బట్టలు

కట్టుకొనే వాణ్ణి. మాట చాలా తీవ్రంగా ఉండేది. పూజా సమయంలో అమ్మ ఫోటోలోంచి 'ఝుం' అనే శబ్దం వినబడేది. అప్పుడు అమ్మ వేరు, నేను వేరు అనిపించేది. ఇప్పుడిక అమ్మే నేను, నేనే అమ్మ. అదే నిత్య కళ్యాణం. ఆ కళ్యాణం అయ్యాక నాకు సిగ్గు పోయింది" అన్నారు.

10-4-1959: ఈ రోజు రాజమండ్రిలో శ్రీ కాళీ జయంతులు ప్రారంభం. శ్రీహరికి 'జంధ్యాల సర్పి' అనే చాల భయంకరమైన వ్యాధి వచ్చింది. 'ప్రాణాంతకమైన వ్యాధి' అని చెప్పి శ్రీ బాబు తమ తీవ్ర దృష్టితోను, చల్లని కర స్పర్శతోను దానిని మాడి పోయేటట్లు చేశారు. "ఏం చెయ్యను? భూత భవిష్యద్వర్తమానాలు తెలుస్తూనే ఉంటాయి. ఏది ఎలా జరుగుతుందో తెలిసినా కర్మానుభవం పూర్తి అయ్యేవరకు తప్పించటానికి వీలు లేదు. ఇదంతా జగన్మాత చిద్విలాసం" అన్నారు.

21-4-1959: (రాజమండ్రి జయంతులలో) శ్రీ బాబు తమ బోధామృతాన్ని అందిస్తూ "వాక్కు ఎంతో మృదువుగా, పవిత్రంగా వుండాలి. భక్తుని మనస్సును అనుక్షణం భగవంతుడు కనిపెట్టుకుని చూస్తూనే ఉంటాడు. అతనికి కావలసినవన్నీ చూస్తూనే ఉంటాడ'న్నారు.

30-4-1959: గురువారం, కాళీ జయంతుల తరువాత, శ్రీ బాబు పూల కుండీల మధ్య కుర్చీలో కూర్చుని 'అధరం మధురం' అనే పాట సుశీలతో పాడించుకుని, భగవానుని నామ మాధుర్యాన్ని వివరిస్తూ మధురమైన బోధ చేశారు. బృందావనంలో అలనాటి గోపికా - కృష్ణుల మధురానుభవ దృశ్యాలను గుర్తుకు తెచ్చారు.

4-5-1959: ప్రొద్దున్నే ఎవరికీ తెలియకుండా ధవళేశ్వరం వెళ్ళిపోయారు. తిరిగి వచ్చాక శ్రీ గురుపూజ జరిగింది. శ్రీ గురుచరణాలను భక్తులు అభిషేకం చేసుకుని, మంచి గంధం అద్ది, మల్లెలతో పూజ చేసుకున్నారు. స్వామి విభూతితో అందరికీ రక్షలు పెట్టారు. ఇది జీవితంలో తరచు దొరకని అమూల్యమైన దివ్య ఘట్టం అని స్వామి స్వయంగా చెప్పారు.

ఆ సాయంత్రం పిల్లలందరిని కూర్చో బెట్టుకుని సుశీలతో భగవద్గీత చదివించారు. 18వ అధ్యాయంలో 51, 52, 53 శ్లోకాలు చాల ముఖ్యమైనవి, సారాంశమంతా అందులో ఉందని చెప్పారు.

-సశేషం

## విష్ణు  కథలు

# శ్రీరామానుజులు

-రమణ ప్రసాద్

శ్రీరామానుజుల వారి కీర్తి దశదిశలా వ్యాప్తిచెందింది. అనేకమంది శిష్యులుగా చేరారు. వారిలో శ్రీవత్సాంక మిశ్రుడు ముఖ్యుడు. ఈ శిష్యుడు శ్రీగురువనుగ్రహంతో అద్వైత సిద్ధాంతులను ఢీకొని వారిని వాదనలలో ఓడించాడు. శ్రీరామానుజులు రామేశ్వరం నుండి బదరీ వరకు యాత్రకు బయలుదేరారు. శ్రీనగరంలో బోధాయనుడు రచించిన బ్రహ్మసూత్రాలకు వ్యాఖ్యానమైన 'బోధాయన-వృత్తి' తాళపత్ర ప్రతిని కనుగొన్నారు, దానిని అనుసరించి తన సుప్రసిద్ధమైన "శ్రీ భాష్యాన్ని" రచించారు. ఆ భాష్యరచనకు ముగ్ధురాలై సాక్షాత్ సరస్వతీదేవి ప్రత్యక్షమై శ్రీరామానుజుణ్ణి "హే! భాష్యకార!" అని సంబోధించింది. ఈ విధంగా ఆళ్వందార్ వారి ప్రధమ కోరికను తీర్చాడు.



శ్రీరామానుజులు శ్రీరంగం చేరుకున్నారు. ఆరోజులలో చోళరాజైన మొదటి కులోత్తుంగుని వలన వైష్ణవులు ఎన్నో హింసలకు గురి అవుతున్నారు. శ్రీ రామానుజుణ్ణి కూడా దేశం విడిచి వెళ్ళమని హితులు సలహా ఇచ్చారు. అప్పుడు శ్రీరామానుజులు కావేరీ తీరం వెంట ప్రయాణం చేసి హొయసాల రాజ్యానికి చేరుకున్నాడు.

ఆదేశపు రాకుమార్తెకు దయ్యం పట్టింది. శ్రీరామానుజులు దయ్యాన్ని వదలగొట్టారు. అప్పటి వరకు జైన మతస్థుడుగా ఉన్న ఆ దేశపురాజైన చిత్తదేవుడు వైష్ణవ మతం స్వీకరించాడు. శ్రీరామానుజులు అనేకమంది జైన గురువులతో

వాదించి ఓడించి దైవభక్తిని ప్రతిష్టించారు. శ్రీరామానుజులు రాజుకు విష్ణువర్ధనదేవుడని నామకరణం చేసి అతని సాయంతో 'మేల్కోట' యాదవాద్రిలో తిరునారాయణ పెరుమాళ్ దేవాలయం నిర్మించారు. పన్నెండు సంవత్సరాల పాటు ఈ ప్రాంతంలో వైష్ణవ సిద్ధాంత ప్రచారం చేశారు.

చోళచక్రవర్తి చనిపోయాడు. ఆ తరువాత రాజ్యానికి వచ్చినరాజు వైష్ణవద్వేషి కాడు. శ్రీరామానుజుడు తిరిగి శ్రీరంగం చేరుకున్నాడు. అక్కడ వైష్ణవాలయాలలో పూజాకార్యక్రమాలు యధావిధిగా జరిగేటట్లు చేశాడు. శిష్యులకోసం అనేక అధ్యయన కేంద్రాలు నడిపారు. ఆలయాలను కట్టించారు. మఠాలను స్థాపించారు. వైష్ణవాలయాలలో వేదాలతోపాటు, ద్రవిడ ప్రబంధాలను కూడా పఠించేటట్లు చేశాడు.

శిష్యుల కోరిక పై శ్రీరంగం, శ్రీపెరంబుదూరు, తిరునారాయణపురాలలో శ్రీరామానుజుల వారి విగ్రహాలు ప్రతిష్టింప చేశారు. తనకు అంత్యకాలం సమీపిస్తున్నది అని తెలిసి దేశంలో వివిధ కేంద్రాలలో 74 మంది శిష్యులను నియమించి, ఆధ్యాత్మిక ప్రచారం నిరాటంకంగా సాగే ఏర్పాటు చేశారు.

శ్రీరామానుజుడు తన 120వ ఏట 1137 సంవత్సరం విష్ణు సాయుజ్యం పొందారు.

శ్రీరామానుజుని సిద్ధాతం విశిష్టాద్వైత దర్శనంగా ప్రసిద్ధి పొందింది. ఈ సిద్ధాంత మూలం ఉపనిషత్తులలోను, ఆళ్వార్లు రచించిన స్తుతులలోను ఉంది. భాగవత సాంప్రదాయాన్ని కూడా శ్రీరామానుజుడు తన సిద్ధాంతంలో ఇముడ్చుకున్నాడు.

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD